క్లుప్తంగా

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్: వరంగల్ వాల్‌మార్ట్ ప్రాంతంలో ప్రధాన పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీకి మరమ్మతులు కొనసాగుతున్నాయి. ఈక్రమంలో ఆ పరిధిలోని ప్రాంతాలైన శివనగర్, ఆర్‌ఎస్‌నగర్, ఎంఎస్‌నగర్, చింతల్, మిల్స్‌కాలనీ, శాకరాశికుంట, ఎస్‌ఎస్‌నగర్ ప్రాంతాల్లో సోమవారం నీటి సరఫరా ఉండదని వరంగల్ ఈఈ శ్రీరామోజు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

పింగిళి కళాశాలలో నేటినుంచి జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాలలో హిందీ, సంస్కృత విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21, 22వ తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి, సదస్సు కన్వీనర్లు మమత, రాజేశ్వరి ఆదివారం తెలిపారు. ఏ స్టడీ ఆఫ్ ఉమెన్ క్యారెక్టర్ ఇన్ రామాయణ అండ్ ఇట్స్ రిలవెన్స్ ఇన్ మోడ్రన్ ఎరా (రామాయణంలో స్త్రీ పాత్రల అధ్యయనం, వర్తమాన కాలంలో నాటి ఔచిత్యం) అనే అంశంపై రెండు రోజులపాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా వరంగల్ అడిషనల్ డీసీపీ సంజీవ్ పాల్గొంటారని తెలిపారు. కేయూ హిందీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సీహెచ్.సంజీవ్ కీలకోపన్యాసం చేస్తారని చంద్రమౌళి వివరించారు.

26న ఎమ్మార్పీఎస్ బహిరంగ సభ



హసన్‌పర్తి: వరంగల్ జిల్లాలో ఈనెల 26న ఎమ్మార్పీఎస్ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు ఆరెపల్లి పవన్‌కుమార్ తెలిపారు. హసన్‌పర్తిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహిరంగ సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవుతారని పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజారపు భిక్షపతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష పూలతో శ్వేతార్కుడికి ప్రత్యేక అభిషేకం



కాజీపేట: సంకటహర చతుర్థి వేడుకలను పురస్కరించుకుని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో ఆదివారం రాత్రి స్వామి వారికి లక్ష పూలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సమర్పించిన వివిధ రకాల పూలతో శ్వేతార్కుడికి అర్చకులు అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ పరిపాలన అధికారి సాయికృష్ణ శర్మ, దేవులపల్లి సదానందం, శనిగరపు రాజ్‌మోహన్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వల్లంపట్ల నాగేశ్వర్‌రావుకు సన్మానం



విద్యారణ్యపురి: ప్రముఖ కళాకారుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, వనప్రేమి సంఘ సేవకుడు డాక్టర్ వల్లపట్ల నాగేశ్వర్‌రావు జన్మదిన వేడుకలను హనుమకొండ టీచర్స్‌కాలనీలోని ఆయన నివాసంలో వల్లంపట్ల డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ బాధ్యులు, కళాకారులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ బాధ్యులు, కళాకారులు నల్లమారి రమేష్, మేకల సూరయ్య, శ్యాంసుందర్, వల్లంపట్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల దొంగ అరెస్ట్



వరంగల్: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో సెల్‌ఫోన్లను దొంగలిస్తున్న నిందితుడిని వ్యాపారులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆదివారం ఉదయం మార్కెట్‌లో రెండు సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. అదేక్రమంలో మరో సెల్‌ఫోన్‌ను దొంగలిస్తున్న సమయంలో వ్యాపారుల కంటపడడంతో వెంటనే అతన్ని పట్టుకుని ఇంతేజార్‌గంజ్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి అదుపులోకి తీసుకున్నారు. చోరీకి గురైన సెల్‌ఫోన్లను నూతన టెక్నాలజీతో గుర్తించి బాధితులకు అందజేస్తామని పోలీసులు తెలిపారు.

ఆటోడ్రైవర్ల ఇష్టారాజ్యం

- జంక్షన్లలో అడ్డదిడ్డంగా నిలిపివేత
- రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు, వాహనదారులు



వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద అడ్డదిడ్డంగా వెళ్తున్న ఆటోలు



ఖిలా వరంగల్: వరంగల్ మహా నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఆటోల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. తగినన్ని ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేక, ఒకవేళ ఉన్నా సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు ఆటోలనే ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు. దాంతో ప్రయాణికులను గమ్యస్థానాలకు త్వరగా చేరవేసేందుకు ఆటో డ్రైవర్ల మధ్య పోటీ నెలకొంటోంది. చేయి చూపగానే ఆటోను నిలపడం , అధిక లోడు, మితిమీరిన వేగంతో వెళ్లడంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వెనుకాముందు చూడకుండా నిలిపివేత

రహదారిపై ఆటో అనగానే సడన్ బ్రేక్ వేసి ఆపుతున్నారు. దాంతో వెనుక ఉన్న వాహనదారుడు ఆటోను ఢీకొడుతూ ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు అనేకం. జంక్షన్లలో ఇష్టానుసారంగా ఆటోలను నిలిపివేస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసుల ఉన్నప్పటికీ ఆటో డ్రైవర్లను పట్టించుకోవడం లేదు. దీంతో ప్రధాన జంక్షన్ల వద్ద రోజురోజుకు ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8 వరకు నగర రహదారులపై ప్రయాణం ప్రమాదకరంగా మారుతోంది. ప్రయాణికుడు ఆటో అని పిలువగానే, చేయి ఎత్తిన వెంటనే ముందు, వెనుక చూడకుండా డ్రైవర్లు తమ వాహనాలను రోడ్డుపై నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య, ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలామంది డ్రైవర్లు పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించి వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. త్వరగా గమ్యం చేరాలనే కాంక్షతో ప్రయాణికులు కూడా డ్రైవర్ల తప్పిదాలను పెద్దగా పట్టించుకోవడం లేదు.

పరిమితికి మించి ప్రయాణికులు

ప్రధానంగా వరంగల్ – హనుమకొండ, వరంగల్ నుంచి వర్ధన్నపేట వైపు, తిమ్మాపురం, రంగశాయిపేట, మామునూరు, ఖిలా వరంగల్ వైపు ప్రయాణికులను తరలించే ఆటోడ్రైవర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలను తరలించే సన్నివేశాలు చూస్తుంటే మరింత ఆందోళన కలుగుతోంది. డ్రైవర్ పక్కన ఇద్దరు, వెనుకాల నలుగురైదురిని కూర్చోబెట్టి ప్రమాదభరితంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈవిషయాలను ట్రాఫిక్ పోలీసులు చూసికూడా చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఫోర్ట్‌రోడ్డు వద్ద, వరంగల్ చౌరస్తా, బస్‌స్టేషన్, హెడ్‌పోస్టాఫీసు జంక్షన్‌లో ఆటో డ్రైవర్లను నియంత్రించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం..

ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు, వాహన పరిమితి, ట్రాఫిక్ నిబంధనలపై తరుచుగా అవగాహ కల్పిస్తున్నాం. ఆకస్మాత్తుగా బ్రేక్ వేసి రోడ్డు ప్రమాదాలకు కారణం కాకూడదని సూచిస్తున్నాం. జంక్షన్ల వద్ద అడ్డదిడ్డంగా ఆటోలను నిలపరాదని చెబుతున్నాం. ట్రాఫిక్ నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తున్నాం.

– రామకృష్ణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, వరంగల్

‘రైతు భరోసా’ వెంటనే ఇవ్వాలి



ఖిలా వరంగల్: నిరసన తెలుపుతున్న నాయకులు



కాజీపేట చౌరస్తాలో ఆందోళన చేస్తున్న నాయకులు



హసన్‌పర్తి: రాస్తారోకో చేస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: రైతు భరోసా కింద రూ.15 వేల చొప్పున రైతులకు వెంటనే ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఖిలా వరంగల్ పడమరకోటలోని అంబేడ్కర్ విగ్రహం, అమరవీరుల స్తూపం వద్ద బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు రైతులతో కలిసి ఆదివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, రమేష్‌బాబు, డాక్టర్ హరిరమాదేవి, కుందారపు రాజేందర్ పాల్గొన్నారు.

అన్నదాతలకు అరచేతిలో స్వర్గం

కాజీపేట: ఎన్నికలకు ముందు అన్నదాతలకు అరచేతిలో స్వర్గాన్ని చూపించిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత కన్నీళ్లు పెట్టిస్తోందని కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కాజీపేట చౌరస్తాలో కార్యకర్తలతో కలిసి ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను విస్మరించిందని ఆరోపించారు. చౌరస్తా ప్రధాన రహదారిపై బైటాయించి నిరసన తెలపడంతో కొద్దిసేపు వాహనాలు ఇరువైపులా నిలిచిపోయాయి. కార్పొరేటర్ సంకు నర్సింగరావు, నార్లగిరి రమేష్, బస్వ యాదగిరి, సుంచు కృష్ణ, నయీంజుబేర్, దువ్వ కనకరాజ్, గబ్బెట శ్రీనివాస్, పిట్టల కల్యాణ్ పాల్గొన్నారు.

హసన్‌పర్తి సెంటర్‌లో..

హసన్‌పర్తి: రైతు భరోసా డబ్బులు విడుదల చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హసన్‌పర్తి సెంటర్‌లో ఆదివారం ఆందోళన చేశారు. దాంతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ మాట్లాడుతూ ఎన్నికల హామీలను అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని ఆరోపించారు. కార్యక్రమంలో 66వ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఆత్మ మాజీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, బీఆర్‌ఎస్ నాయకులు చాతళ్ల వేణుగోపాల్, నద్దునూరి నాగరాజు, దీకొండ భిక్షపతి, చేరాలు, బోడ యుగంధర్, జన్ను కిషన్ పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న భోగేశ్వర్

ఖిలా వరంగల్: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి విడనాడాలని టీపీడీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కదారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం జరిగిన పర్వతగిరి మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రావాల్సిన ఐదు పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలన్నారు. 2023, జులై నుంచి అమలు చేయాల్సిన పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని, మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్, అశోక్, మల్లికార్జున్, భిక్షపతి, వెంకటేశ్వర్లు, రమేష్, భదావత్ రాజు, కమలాకర్, సురేష్‌బాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



హన్మకొండ: దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ తండ్రి చుంచు వెంకటయ్య (70) మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతూ స్వగృహం హసన్‌పర్తి మండలం దేవన్నపేటలో శనివారం మరణించారు. ఆదివారం వెంకటయ్య అంత్యక్రియలు జరిగాయి. ఆయా పార్టీల నాయకులు, సామాజిక, ప్రజా సంఘాల నాయకులు చుంచు రాజేందర్‌ను పరామర్శించారు.

డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి..

హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో మరణించిన దేవన్నపేటకు చెందిన చుంచు వెంకటయ్య మృతదేహాన్ని వివిధ పార్టీల నాయకులు ఆదివారం సందర్శించి నివాళులర్పించారు.

ఎంబాడి రవీందర్ కుటుంబానికి..



ఖిలా వరంగల్: అనారోగ్యంతో మృతి చెందిన మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రవీందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని దయాకర్‌రావు గుర్తుచేసుకున్నారు. పరామర్శించిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

కాజీపేటలో మాలల ఆత్మీయ సమ్మేళన ర్యాలీ



కాజీపేట చౌరస్తాలో ఆత్మీయ సమ్మేళన ర్యాలీని ప్రారంభిస్తున్న మర్యాల కృష్ణ

కాజీపేట: మాలల ఆత్మీయ సమ్మేళన ర్యాలీని తేజోమయి మాల కుల సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు మర్యాల కృష్ణ కాజీపేట చౌరస్తాలో ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణతో కుట్రలకు పాల్పడుతున్నాయని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగ్, సంఘం ప్రధాన కార్యదర్శి బండి విజయ్ కుమార్, తెలంగాణ రైల్వే జేఏసీ కోకన్వీనర్ కొండ్ర నర్సింగరావు, పప్పుల గోవర్ధన్, సీహెచ్.కొమ్మాలు, జంగం బాబురావు, పడిదెల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు

హన్మకొండ: తన వ్యవసాయ బావికి మంజూరైన విద్యుత్ కనెక్షన్‌ను మూడేళ్ల క్రితం అకారణంగా రద్దు చేసిన దుగ్గొండి ఏఈ, లైన్‌మెన్‌పై సీజీఆర్‌ఎఫ్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, ఎన్పీడీసీఎల్ సీఎండీకి వినతిపత్రం అందించినా ఫలితం లేదని దుగ్గొండి మండలం రేబల్లెకు చెందిన రైతు గుగులోతు అనిల్ వాపోయాడు. ఈక్రమంలో దుగ్గొండి ఏఈ, లక్ష్మీపురం లైన్‌మెన్ బాబుపై ఈనెల 21న జరగనున్న డిపార్ట్‌మెంట్ విచారణ పారదర్శకంగా, నిజాయితీగా జరుగుతుందనే నమ్మకం తమకు లేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్రమార్కులపై అధికారులు నిజాయితీగా విచారణ జరపాలని కోరారు. కాగా, దుగ్గొండి సెక్షన్‌లో జరిగిన అవకతవకలు, అక్రమాలపై సాక్షి దినపత్రిలో మే 23న పైస ముడితేనే పని అనే శీర్షికన, మే 28న ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపులో అక్రమాలు అనే శీర్షికతో కథనాలు ప్రచురితమయ్యాయి. ఆ కథనాలకు స్పందించిన టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం.. ఈనెల 21న డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీకి ఆదేశించింది.

పైపులైన్ల లీకేజీలు





ఫోర్ట్‌రోడ్డుపై పైపులైన్ల లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు

ఖిలా వరంగల్: పైపులైన్ల లీకేజీలను అరికట్టి తాగునీరు సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు. వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారి ఫోర్ట్‌రోడ్డుపై పెట్రోల్ బంక్ సమీపంలో మెయిన్ పైపులైన్ లీకేజీ అయింది. దాంతో తాగునీరు వృథాగా పోతోంది. రహదారిపై నీరు పారుతుండడంతో వాహనం అదుపుతప్పి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. లీకేజీలను అరికట్టాలని పలుమార్లు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుచేయాలి



మాట్లాడుతున్న తిరుపతి మాదిగ

కేయూ క్యాంపస్: ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత కాంగ్రెస్ పార్టీ నెరవేర్చడం లేదని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిమాదిగ అన్నారు. దాంతో మాదిగ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. ఎస్సీల వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీలోని ఆదివారం నిర్వహించిన ఎంఎస్‌ఎఫ్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల డీఎస్సీ పోస్టుల్లో మాదిగ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని వాపోయారు. గ్రూప్ 1, 2, 3, 4 ఉద్యోగాల్లో ఎస్సీ వర్గీకరణ అములు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 24న కేయూలో జరగనున్న ఎంఎస్‌ఎఫ్ రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంఎస్‌ఎఫ్ కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్, బాధ్యులు ఓదెల అరిస్టాటిల్, కీర్తి దిలీప్, అరవింద్, మేకల వరప్రసాద్ పాల్గొన్నారు.

‘మధ్యాహ్న’ వంటకు కట్టెల పొగ

- గ్యాస్ సిలిండర్ల కోసం నిర్వాహకుల ఎదురుచూపు
- పొగతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు





కాజీపేట పాఠశాలలో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న కార్మికులు, తడిసిన వంటచెరుకు

కాజీపేట: సర్కార్ బడుల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచి పౌష్టికాహారాన్ని అందించడానికి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. వంట బాధ్యతలను మహిళా సంఘాల సభ్యులకు అప్పగించింది. ప్రస్తుతం ఏజెన్సీ నిర్వాహకుల పరిస్థితి దారుణంగా మారింది. కూరగాయలు, కోడిగుడ్లు, నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకడం, ఆ స్థాయిలో ప్రభుత్వం ధరలు పెంచకపోవడంతో నిర్వహణ భారంగా మారిందని నిర్వాహకులు వాపోతున్నారు. వంట చేయడానికి గ్యాస్ సిలిండర్లు అందించకపోవడం, ఇరుకైన గదుల్లో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్నారు. వర్షాకాలంలో కట్టెలు తడిసి మంట రాక పొగతో అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు వంట చెరుకు కొరత.. మరో వైపు సరుకుల ధరలు పెరిగాయి. అయినా వంట కార్మికులు ఆర్థిక నష్టాల్లోనూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సక్రమంగా అందిస్తున్నారు.

పొగతో ఇక్కట్లు

కాజీపేట మండలంలో 6 ఉన్నత పాఠశాలలు, 10 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 3వేల మందికి పైగా విద్యార్థులుండగా వారందరికి మధ్యాహ్న భోజనం కట్టెల పొయ్యి మీదే వండాల్సి వస్తోంది. అయితే అసలు కథ అంతా ఇక్కడి నుంచే ప్రారంభమవుతుందని చెప్పొచ్చు. ఒకవైపు హరిత హారంలో విరివిగా మొక్కలు నాటుతుంటే.. మరో పక్కన మధ్యాహ్న భోజనం కోసం ఇష్టారీతిగా చెట్లను నరికి వేస్తున్నారు. పొగ సమస్యను అధిగవించడంతో పాటు పర్యావరణాన్ని కాపాడటం కోసం ప్రభుత్వం వెంటనే వంట గ్యాస్ సిలిండర్లను అందించాలని పలువురు కోరుతున్నారు.

వంట చేయడం ఇబ్బందిగా ఉంది



మధ్యాహ్న భోజనం వంట చేయడానికి గ్యాస్ సిలిండర్లు ఇవ్వకపోవడంతో కట్టెలను ఉపయోగిస్తూ వంట చేస్తున్నాం. వర్షాలు కురిసినప్పుడు కట్టెలు తడిసి వంట చేయలేక అవస్థలు పడుతున్నాం. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– పర్వీన్ బేగం, వంట ఏజెన్సీ నిర్వాహకురాలు

పొగతో అనారోగ్య సమస్యలు



కట్టెలతో వంట చేస్తుండడంతో విపరీతమైన పొగ వస్తోంది. పొగను పీల్చి అనారోగ్యం బారిన పడుతున్నాం. విద్యార్థులకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. గ్యాస్ కన్నా కట్టెల కోసం ఎక్కువగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం చెల్లించే నగదు.. వంట సరుకుల కొనుగోలుకే సరిపోతోంది.

– శ్రీవాణి, ఏజెన్సీ నిర్వాహకురాలు, సోమిడి

అంకితభావం ఉన్న జర్నలిస్ట్ సుభాష్



మాట్లాడుతున్న కడియం శ్రీహరి

హసన్‌పర్తి: జర్నలిస్ట్ వృత్తికి న్యాయంచేస్తూ ప్రజా సమస్యలపై అంకితభావంతో పనిచేసిన గొప్ప వ్యక్తి నాయకపు సుభాష్ అని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కొనియాడారు. 55వ డివిజన్ భీమారంలో సుభాష్ సంతాప సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భీమారం అభివృద్ధి, ప్రజల సమస్యలను పలుమార్లు తన దృష్టికి సుభాష్ తీసుకొచ్చారని గుర్తుచేశారు. భీమారంలో సుభాష్ పేరుపై కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంపీ నిధులు మంజూరు చేస్తానని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యులను ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నరేందర్ సమావేశంలో కార్పొరేటర్ జక్కుల రజిత, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, జర్నలిస్టులు పరామర్శించారు.


ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

దేశాయిపేట: సీకేఎం కళాశాల మైదానంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతం సారంగపాణి వరుసగా 10వ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా టి.రఘునాథరావు, కోశాధికారిగా కె.భద్రయ్య, గౌరవ అధ్యక్షులుగా చీర్ల మల్లారెడ్డి, కె.సదానందం, కానుగంటి అశోక్, సోల రవి, డి.రమేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్‌రెడ్డి, ప్రభాకర్, వేణుప్రసాద్, జంపయ్య, నగేష్, యాదగిరి, గజేందర్, శోభన్, యాదగిరి, గౌరవ సలహాదారులుగా సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్, కుమారస్వామి, చందర్‌రావు, ఆర్గనైజర్లుగా కూరాకుల రాజు, నర్సింహారెడ్డి, చిరు, గణేష్, రాజు, నర్సింహాచారి, రమేష్ ఎన్నికయ్యారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో మరణించిన ముచ్చర్లకు చెందిన గంట మణెమ్మ అంత్యక్రియలకు ఆ గ్రామానికి చెందిన చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి రూ.3 వేలు అందజేశారు. కార్యక్రమంలో చిర్ర శ్రవణ్, కె.మల్లారెడ్డి, సాంబారెడ్డి, సమ్మిరెడ్డి, కన్నెబోయిన ఐలయ్య, సాయిలు, కర్ణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.